హద్దులు దాటొద్దు

తోటపల్లిగూడూరు: నూతన సంవత్సర వేడుకల్లో యువత హద్దులు దాటి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఎస్సై జంపాని కుమార్ హెచ్చరించారు. ఆదివారం పోలీసులు మండల ప్రధాన కేంద్రాల్లో తిరిగి ప్రజలకు నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కోడూరు, కాటేపల్లి బీచ్‌ల సందర్శనకు వచ్చే వారు నిబంధనలు పాటించాలన్నారు.

లక్ష్యాలను సాధించాలి


ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: కొత్త సంవత్సరంలో విద్యార్థులు లక్ష్యాలను పెట్టుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఒక ప్రకటనలో నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి ఒక్కరి ఇంట్లో సంతోషాలు వెల్లివిరియాలని, ఆనందకరమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.

పేడూరు సొసైటీ అభివృద్ధికి కృషి


వాటర్ డిస్పెన్సర్‌ను అందజేసిన దృశ్యం

తోటపల్లిగూడూరు: పేడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు తూపిలి ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన తండ్రి తూపిలి భాస్కర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం సొసైటీ కార్యాలయానికి వాటర్ డిస్పెన్సర్‌ను వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీ స్థానిక రైతాంగానికి అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. ఎరువులు, పురుగు మందులను సబ్సిడీ ధరలపై అందిస్తూ ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్‌రెడ్డి, సొసైటీ సీఈఓ రమణమూర్తి, సభ్యులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

మనుబోలు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఎస్సై అజయ్‌కుమర్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జైలు జీవితం గడపాల్సి వస్తుందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నారాయణ, కానిస్టేబుళ్లు మాధవ్, శ్రీనివాసులు, నరేష్, ఇస్మాయిల్, లక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీనివాస కల్యాణం



కోవూరు: కోవూరులోని శ్రీగుర్రం శ్రీరాములుశెట్టి కల్యాణ మండపంలో ఆదివారం పంచాక్షరి బ్రాహ్మణ జాగృతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం కనుల పండువగా జరిగింది. కోదండరామస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంతాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు భవానీ ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శి నారాయణమూర్తి, సంయుక్త కార్యదర్శి సుబ్బు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే సంతాపం

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం): మండలంలోని నాగాయగుంట గ్రామ సర్పంచ్ చంద్రగిరి రాజశేఖర్ (54) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సంతాపం తెలిపారు. రాజశేఖర్ కుటుంబసభ్యులు మనోధైర్యంతో ఉండాలని ధైర్యం చెప్పారు.

కరసేవకులకు సన్మానం



కోవూరు: అయోధ్యలో రామమందిరం ప్రారంభ నేపథ్యంలో 30 మంది కరసేవకులను ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఆ పార్టీ నాయకులు కె.ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి వివిధ అంశాలు వెల్లడించారు. కరసేవకులు మాబత్ సింగ్, శ్రీనివాసులురెడ్డి, జెట్టి వేణు, దేవరం శ్రీకర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి, నాయకుడు టి.సుధాకర్‌రెడ్డి విజయ కుమార్, నగేష్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం వైఎస్ జగన్

- పెన్షన్ల పంపిణీలో ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొనాలి
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



నగదు అందజేస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అన్ని విధాలుగా అండగా ఉన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి ఈనెల నుంచి లబ్ధిదారులకు ఇస్తున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కింది.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక పచ్చిపాల అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్దమొత్తంలో పింఛన్ల పంపిణీ లేదన్నారు. కొన్ని రాష్ట్రాల్లో కేవలం రూ.500 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈనెల నుంచి ఇవ్వబోయే పింఛన్ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, గృహ సారథులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. గృహ సారథులు, నాయకులు సమన్వయం చేసుకుని ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. ఈ రెండు నెలలపాటు ప్రతి ఒక్కరూ పార్టీ కార్యాక్రమాల్లో పాల్గొనాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు అందరూ కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు చేసుకున్నారు.

పాట ఆవిష్కరణ

రానున్న ఎన్నికలకు సంబంధించి నల్గొండ జిల్లాకు చెందిన గద్దర్ పాడిన పాటను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్ రెడ్డి లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా ప్రసన్నకుమార్‌రెడ్డి, రజత్ కుమార్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ టి.పార్వతి. వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, నాగార్జున కన్‌స్ట్రక్షన్ అధినేత వసంతకుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ అహ్మద్, జల్‌జీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, నేతలు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, సాయియశ్వంత్ రెడ్డి, జగదీష్, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు విజయసేనారెడ్డి, సుధీర్‌రెడ్డి, రాజగోపాల్, జుబేర్ బాషా, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు పంపిణీ

కోవూరు మండలం చెర్లో గాంధీ సంఘం జగనన్న కాలనీలో 14 కుటుంబాలు చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. వారందరికీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి గృహాలు మంజూరు చేశారు. వాటికి సంబంధించిన పనుల నిమిత్తం ఎమ్మెల్యే లబ్ధిదారులకు రూ.1.40 లక్షలను ఎన్ఎస్ఆర్ ట్రస్టు ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు.

మైపాడులో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కల్యాణ్‌కుమార్ రెడ్డి

ఇందుకూరుపేట: వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని మైపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నెల్లూరుకు చెందిన రెయిన్‌బో సూపర్ స్పెషలిటీ వైద్యశాల డాక్టర్లు సుమారు 300 మందికి వైద్యసేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జనవరి ఒకటో తేదీన కల్యాణ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు కావడంతో ముందుస్తుగా అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పేనేటి సునీల్ కుమార్, మేనేజర్లు పుట్టా బాలాజీ, కాపా ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ కూనంగారి రమణయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీహరికోట ప్రసాద్, శివాలయం చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు, సర్పంచ్ సంగం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కోవూరు సీఐగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

కోవూరు: కోవూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టీవీ శ్రీనివాసరావు ఆదివారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా ఏసీబీలో సీఐగా పనిచేస్తూ ఇక్కడ బదిలీ అయ్యారు. ఎస్సై రంగనాథ్ గౌడ్, ఇందకూరుపేట ఎస్సై వీరేంద్రబాబు మర్యాదపూర్వకంగా శ్రీనివాసరావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని మండలాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు పక్కాగా నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ మండల కమిటీలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అధ్యక్షుడిగా పెదమల్లు రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఏనుగు శశిధర్‌రెడ్డి, నెట్టెం కృష్ణంనాయుడు, జనరల్ సెక్రటరీలుగా బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వూకోటి లక్ష్మీనారాయణ, పలుకూరు పోలిరెడ్డి, ట్రెజరర్‌గా కోనం చినబ్రహ్మయ్య, సెక్రటరీలుగా పామూరు లచ్చారెడ్డి, తిక్కమనేని పెంచలనాయుడు, కొల్లి రాజగోపాల్‌రెడ్డి, మొలబంటి శేఖర్‌బాబు, వేణురెడ్డిని నియమించారు.

వెంకటాచలం మండలంలో..

వెంకటాచలం: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా కొణిదెన మోహన్‌నాయుడు, ఉపాధ్యక్షులుగా కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, డేగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులుగా షేక్ అక్బర్, కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మందల పెంచలయ్య, కోశాధికారిగా వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, కార్యదర్శులుగా నాటకం శ్రీనివాసులు, వెలిబోయిన వెంకటేశ్వర్లు, నంబూరి రాజానాయుడు, డక్కిలి రమణయ్య, రౌతు మల్లికార్జున నియమితులయ్యారు.

తోటపల్లిగూడూరు మండలంలో.

తోటపల్లిగూడూరు: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా శంకరయ్యగౌడ్‌ను మరోమారు నియమించారు. ఉపాధ్యక్షులుగా కావల్‌రెడ్డి రంగారెడ్డి, చెరుకూరు సరళకుమారి, ప్రధాన కార్యదర్శులుగా ఈదూరు రామాచార్యులు, మన్నెం చిరంజీవులగౌడ్, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా కావల్‌రెడ్డి చంద్రోశేఖర్‌రెడ్డి, కార్యదర్శులుగా మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, దువ్వూరు గంగాధర్‌రెడ్డి, కోడూరు పురంధర్‌రెడ్డి, గూడూరు విష్ణుమోహన్ రెడ్డి నియమితులయ్యారు.

కోవూరు నియోజకవర్గంలో..

కోవూరు: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా నలబోలు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా పన్నెం సుధాకర్, పమజుల సుధాకర్, ప్రధాన కార్యదర్శులుగా వంగవరపు మధుసూదన్‌రెడ్డి, కడుంబడి మునెయ్య, గొల్లపల్లి తులసీకృష్ణ, కోశాధాకారిగా మావులూరు వెంకట రమణారెడ్డి, కార్యదర్శులుగా మాగుంట అమర్‌నాథ్‌రెడ్డి, సముద్రాల శివశంకర్, ఒట్టూరు రామకృష్ణ, గూడూరు హరిప్రసాద్‌రెడ్డి, గుంజి శ్రీకాంత్‌ను నియమించారు.

బుచ్చిరెడ్డిపాళెంలో..

పార్టీ నగర పంచాయతీ అధ్యక్షుడిగా టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పఠాన్ బషీర్‌ఖాన్, శనగల శ్రావణ్, ప్రధాన కార్యదర్శులుగా కొన్నిపాటి కోటేశ్వరరావు, షేక్ గౌస్‌బాషా, వల్లిపు నాగమణి, కోశాధికారిగా కంటా నరేష్‌కుమార్, కార్యదర్శులుగా తమ్మిరెడ్డి ఆదిశేషమ్మ, మేకల మాల్యాద్రి యాదవ్, వల్లూరు వేణు, వాయిగుండల శ్రీనివాసులు, అందె రాజేశ్వరి నియమించబడ్డారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం మండల పార్టీ అధ్యక్షుడిగా చెర్లో సతీష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కత్తి మహేష్, పుత్తేటి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా పిల్లెల మోహన్ మురళీకృష్ణ, కోవూరు మురళి, ఎల్.మస్తానయ్య, కోశాధికారిగా పిడుగు తిరుమలేష్, కార్యదర్శులుగా పి.భాస్కర్, కలిసిరి అరుణ, పగడాల కృష్ణ, ఆదిరెడ్డి హరిరెడ్డి, షేక్ నాగూర్‌ను ఎంపిక చేశారు.

విడవలూరు మండలంలో..

విడవలూరు మండలం అధ్యక్షుడిగా బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కాటంరెడ్డి నవీన్ రెడ్డి, బెల్లంకొండ శ్రీధర్, ప్రధాన కార్యదర్శులుగా తాతా ప్రభాకర్, కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, నాటూరు భాస్కర్, కోశాధికారిగా కొండూరు శ్రీనివాసులు, కార్యదర్శులుగా కొల్లు చినవెంకయ్య, పోనుగంటి నారాయణ, నావూరు నరేష్, నాశిన రమణయ్య, చెన్నంశెట్టి సాయికుమర్ నియమితులయ్యారు.

కొడవలూరు మండలంలో..

కొడవలూరు: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా గంధం వెంకటశేషయ్య నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా నాగిరెడ్డి రమేష్, మారంరెడ్డి రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా నంబూరి ప్రసాద్, నీలకంఠం శ్రీధర్‌రెడ్డి, కాకి భాస్కర్, కోశాధికారిగా కరకంబాక కృష్ణ, కార్యదర్శులుగా తమ్మిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, అల్లం సత్యం, దేవనబోయిన శివకుమార్, నలబాయి కామాక్షి, షేక్ మహబూబ్‌బాషా నియమితులయ్యారు.

ఇందుకూరుపేట మండలంలో..

ఇందుకూరుపేట: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షులుగా నీరుకట్ల శ్రీనివాసులు, పోనమల్లి రామచంద్రయ్య, జనరల్ సెక్రటరీలుగా ఉడతా వెంకటశేషయ్య, దండిగుంట ఫణీంద్రనాయుడు, గాలి ప్రసాద్, ట్రెజరర్‌గా పాలెపు వెంకటసుబ్బమ్మ, సెక్రటరీలుగా పిడూరు సునీల్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు వెంకటేశ్వర్లు, మైపాడు రామయ్య, అర్జున తులసీరాం, శ్రీరం నవీన్‌కుమార్ నియమితులయ్యారు.

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ సమావేశం

నెల్లూరు(బృందావనం): ఆచారివీధిలోని ఆర్యవైశ్య క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌కంట్యాక్స్ ఆడిటర్ సత్యనారాయణ గుప్తా హాజరయ్యారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. సీనియర్ సిటిజన్లకు అవసరమైన సామగ్రితో కిట్లను అందజేశారు. ఈ నెల్లో జన్మదినాన్ని జరుపుకొంటున్న వారిని సత్కరించారు. సత్యనారాయణగుప్తా, రమణకుమారి దంపతులను సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి సుబ్బారావు, సభ్యులు వాయుగుండ్ల బసవయ్య, బాబుసత్యనారాయణ, మురళీకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకటేశ్వరాలయంలో ధనుర్మాస పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెట్టు సుధాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా ఖాజామస్తాన్, కోశాధికారిగా చెంచయ్య, మహిళా కార్యదర్శిగా మేరీ బ్లెసింగ్టన్, వైస్ ప్రెసిడెంట్‌గా రాణి ఎబినైజర్, జాయింట్ సెక్రటరీలుగా సావిత్రమ్మ, ప్రవీణ, గౌరవ సలహాదారులుగా గిరిజ, కార్యవర్గ సభ్యులుగా ప్రసాద్, వెంకటేశ్వర్లురెడ్డి, అనంతరావు, కొండారెడ్డి, ఎమ్మార్ నాయుడు, రాజగోపాల్, మురుగన్, వెంకటసుబ్బయ్య, బాలసుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావును ఎన్నుకున్నారు.

మహిళ మెడలో సరుడు అపహరణ

వరికుంటపాడు: వ్యవసాయ పొలంలో గడ్డి కోస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఓ మహిళ మెడలోని సరుడును అపహరించుకెళ్లిన ఘటన ఆదివారం వరికుంటపాడులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఆంద్రా వారిపల్లెకు చెందిన మద్దిరెడ్డి సీతారావమ్మ బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలంలో గడ్డి కోస్తుండగా ఈ ఘటన జరిగింది. బాధిత మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై కె.సుమన్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దొంగ కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్సై తెలిపారు.

క్యాలెండర్ల పంపిణీ

సోమశిల: అనంతసాగరం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులకు ఆదివారం ఏపీటీఎఫ్ క్యాలెండర్, ప్యాకెట్ డైరీలు, పాచ్‌లు, సీఎల్ క్యాట్ బుక్ పంపిణీ చేశారు. ఈ మేరకు యూనియన్ అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మహబూబ్ బాషా, గౌరవాధ్యక్షుడు రామిరెడ్డి, జిల్లా కౌన్సిలర్ మాల్యాద్రి రెడ్డి ప్రతి పాఠశాల ఉపాధ్యాయులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ ఏపీ ఉపాధ్యక్షుడిగా రమణయ్య

సోమశిల: అనంతసాగరం మడలం పాతాళపల్లి గ్రామానికి చెందిన కానగల రమణయ్యను ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జాతీయ అధ్యక్షుడు వరిందర్ కుమార్‌ఫూల్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బోయ మద్దులేటి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పిడుగు చంద్రయ్య నియమించారు. ఆదివారం రమణయ్య మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమగ్రంగా నిర్వర్తిస్తానన్నారు.

గెస్ట్ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి చర్యలు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ఏపీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ జె.పుష్పరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో పీజీటీ జీవశాస్త్రం ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు జనవరి 3వ తేదీలోగా తమ దరఖాస్తులను దాఖలు చేయాలన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ, టెట్ ఉత్తీర్ణులు అర్హులన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

సంగం: మండలంలోని దువ్వూరు వద్ద నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై కారు, బైక్ ఢీకొన్న ఘటనలో బైక్ నడుపుతున్న వెంగారెడ్డి పాళెం గ్రామానికి చెందిన ఎస్.రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో బుచ్చిరెడ్డిపాళేనికి తరలించారు. సంగం పోలీసులు ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం జాయింట్ సెక్రటరీగా బిలాల్

అనుమసముద్రంపేట: ఆంధ్రప్రదేశ్ విలేజ్ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా అనుమసముద్రం సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ షేక్ మొహమ్మద్ బిలాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆదివారం బిలాల్ విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన ఈ బాధ్యతలకు వన్నె తెచ్చేలా పని చేస్తానన్నారు. సచివాలయ ఉద్యోగుల సంక్షేమం సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

కమ్మేసిన పొగమంచు



పొగమంచులో వెళ్తున్న వాహనాలు

పొదలకూరు: పట్టణాన్ని పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం 8 గంటల వరకు కూడా మంచు వీడడం లేదు. ఓ పక్క ఎండపడుతున్నా మంచు తెరలు తొలగిపోవడం లేదు. ఫలితంగా వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.

న్యూ ఇయర్ సందడి



వివిధ ఆకృతుల్లో తయారు చేసిన కేకులు

పొదలకూరు: పట్టణంలో కొత్త సంవత్సర జోష్ నెలకొంది. ఆదివారం రాత్రి నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. స్వీట్స్, బేకరీ వ్యాపారులు రకరకాల ఆకృతుల్లో తయారు చేసిన కేకులను విక్రయిస్తున్నారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల వారు ముందుగా ఆర్డర్లు ఇచ్చి కేకులకు తీసుకెళ్తున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): శాంతినగర్‌లోని రెడ్ల ఐక్యవేదిక కార్యాలయంలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. రెడ్ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీవీ రెడ్డి, నేతలు ధనంజయరెడ్డి, సంఘమిత్ర రవీంద్రారెడ్డి, కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రమౌల్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కేతిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సింహపురి నగరానికి సంబంధించిన సమగ్ర విషయాలతో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను సింహపురి వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. శాంతినగర్‌లోని నిర్మలసౌధలో నిర్వహించిన కార్యక్రమంలో సింహపురి వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు వెందోటి ధనంజయరెడ్డి, రమణారెడ్డి, పేరం రాఘవరెడ్డి, రత్నం, వేణుగోపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్లో 'స్పందన' నేడు

నెల్లూరు(బారకాసు): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో సమస్యలపై అర్జీలను అందజేయాలని కోరారు.

'సెయింట్ పీటర్స్'కు వితరణ



నెల్లూరు(టౌన్): రంగనాయకులపేటలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌కు రూ.50 వేలను రెవరెండ్ వరప్రసాద్‌కు మదర్‌థెరీసా చారిటీస్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. బోర్డింగ్ పిల్లలకు కూల్‌డ్రింక్స్, కేక్స్, ఆహారాన్ని అందజేశారు. సభ్యులు దారా జయరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో ఆదివారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేకాలంకరణ చేసి ఊరేగించారు. మాల వేసుకున్న వారు ఈనెల 3వ తేదీన అయ్యప్ప దర్శనానికి వెళ్తున్న నేపథ్యంలో సోమవారం స్వామి అంబలి పూజ నిర్వహిస్తున్నట్లు భక్తమండలి వెల్లడించింది. అత్యంత వైభవంగా గ్రామపూజ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అన్నదానం చేస్తామన్నారు.

హైవేపై ఇష్టానుసారంగా వాహనాలు ఆపొద్దు

- ఫేస్‌వాష్‌ను కొనసాగించాలి
- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



హోటల్ లైసెన్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

మనుబోలు: నిబంధనలకు విరుద్ధంగా హైవే ఇష్టానుసారంగా వాహనాలు ఆపినా, ధాబాల్లో మద్యం తాగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి హెచ్చరించారు. శనివారం అర్ధరాత్రి మండల పరిధిలోని హైవే వెంబడి ఉన్న పలు హోటళ్లలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హైవేకి ఇరువైపులా ఉన్న హోటళ్ల వద్ద నిర్దేశించిన పార్కింగ్ స్థలంలోనే వాహనాలు ఆపాలన్నారు. అలా కాకుండా ఇష్టానుసారం ఆపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగున్నాయని తెలిపారు. ధాబాల్లో మద్యం తాగడం నిషేధమన్నారు. రాత్రి పూట నిర్ణీత సమయంలోనే హోటళ్లను మూసివేయాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా, మద్యం తాగి వాహనాలు నడిపినా, మైనర్లు వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ రహదారిపై ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని కొనసాగించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. నిషేధిత వస్తువుల అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన



పొదలకూరు: వినాయకమాన్యం పాఠశాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

పొదలకూరు: పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారి చిన్న ఓబులేసు తెలిపారు. ఆయన ఆదివారం పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వసతుల గురించి ఆరా తీశారు. భవనాలు సక్రమంగా లేని చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేయాలా? వద్దా అని? కిందిస్థాయి అధికారులతో చర్చించారు. పుట్టాయగుంట పాఠశాల, నర్సారెడ్డికాలనీ, జెడ్పీ హైస్కూళ్లలో ఏర్పాటు చేసే కేంద్రాల భవనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ నియోజకవర్గంలో 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. పుట్టాయగుంట స్కూల్ భవనాలు శిథిలావస్థకు చేరడంతో తొలగించారని దాని స్థానంలో ప్రత్యామ్నాయ కేంద్రాల ఏర్పాటుపై పరిశీలిస్తున్నట్లు చెప్పారు. వినాయకమాన్యం పాఠశాలను పరిశీలించామని అక్కడ పనులు జరుగుతున్న కారణంగా మరో చోట ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. వసతులపై కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందజేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కె.వీరవసంతరావు, వీఆర్వోలు, బీఎల్వోలు, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి తదితరులున్నారు.



మనుబోలు: కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ కలెక్టర్

- **మనుబోలు:** పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు తప్పనిసరి అని స్పెషల్ కలెక్టర్ ఓబులేసు సూచించారు. మండలంలోని మనుబోలు, వీరంపల్లి, వడ్లపూడి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్ వసతులు, వృద్ధులు వెళ్లేందుకు ర్యాంప్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వసతులు లేనిచోట ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శివకృష్ణయ్య, వీఆర్వోలు నాగార్జునరెడ్డి, మురళీధర్, వీఆర్ఏలు శంకర్, స్వాతి, బీఎల్వోలు మాధవి, శ్రీకాంత్ తదితరులున్నారు.

20 లీటర్ల సారా పట్టివేత



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ సీఐ నయనతార, సిబ్బంది

ఆత్మకూరు: అక్రమంగా తయారు చేసి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 20 లీటర్ల సారా, వంద లీటర్ల బెల్లం ఊటను సెబ్ సీఐ నయనతార ఆధ్వర్యంలో ధ్వంసం చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆమె వివరాలను విలేకరులకు వివరించారు. ఏఎస్‌పేట వినాయకనగర్ అడ్డు రోడ్డు వద్ద ఓ వ్యక్తి 20 లీటర్ల సారాని అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా ఆమె తన సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద సేకరించిన సమాచారం మేరకు సమీపంలోని పొలాల్లో సారాయి తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్న బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు వివరించారు.

చర్చిలో నూతన సంవత్సర ఆరాధనలు



నెల్లూరు(బృందావనం): నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వీఆర్సీ సెంటర్ సమీపంలోని బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్లో వాచ్ నైట్ సర్వీస్‌ను ఆదివారం నిర్వహించారు. పాత ఏడాదికి వీడ్కోలు పలికే వాక్యోపదేశాన్ని గంటా జార్జి స్టీవెన్సన్ అందించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సంఘ కాపరి రెవరెండ్ శ్యామ్‌సన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. అనంతరం నూతన సంవత్సర వాగ్దానపు వాక్య కార్డులను అందజేశారు. డౌనీహాల్ యువజన విభాగం ఆధ్వర్యంలో ప్రదర్శించిన సౌలు - పౌలు నాటిక ఆకట్టుకుంది. సంఘ చైర్మన్ సురేంద్రబాబు, కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, కోశాధికారి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(బృందావనం): జాతీయ స్థాయి బాలల చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమాన్ని నెల్లూరు నగరంలోని పురమందిరంలో అమీర్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు అమీర్‌జాన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పలువురు చిత్రకారులను ఈ సందర్భంగా సత్కరించారు.